# బీఆర్ఎస్‌తోనే ప్రజా సంక్షేమం

**ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత**

కంటోన్మెంట్, నవంబర్ 27: బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే నిండా మునుగుడే అని, సీఎం కేసీఆర్ తెలంగాణకు శ్రీరామ రక్ష అని అన్నారు. ఆరో వార్డులోని కాంటా బస్తీలో ఎన్నికల ప్రచారాన్ని బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్‌తో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత నిర్వహించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని పేర్కొన్నారు. ఆసరా పింఛన్లు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్, రైతు పెట్టుబడి సాయం వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. కేసీఆర్ సారథ్యంలో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.400కే గ్యాస్ సిలిండర్, సౌభాగ్య లక్ష్మి పథకం కింద మహిళలకు రూ.3000, రేషన్‌కార్డులో పేరున్న ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల కేసీఆర్ బీమా, గృహలక్ష్మి పథకం కింద అర్హులకు ఇండ్లు నిర్మించి అందజేస్తామని తెలిపారు. అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు దీననాథ్ యాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆరో వార్డు కాంటా బస్తీలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత

## 'ఓటర్ హెల్ప్‌లైన్'లో మీ ఓటు స్లిప్ చూసుకోండి

**లేదా.. 1950కి కాల్ చేయండి**

**పోల్‌క్యూరూట్ యాప్ ద్వారా క్యూ వివరాలు తెలుసుకోండి**

**ఓటర్లకు రొనాల్డ్ రాస్ విజ్ఞప్తి**

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో చదువుకున్న వారే ఓటు హక్కు వినియోగానికి దూరంగా ఉంటున్నారన్న అపవాదు ఉన్నదని, ప్రతి ఒక్కరూ పోలింగ్ రోజున హాలిడే అని భావించకుండా విద్యావంతులంతా ఆయా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్‌హాల్‌లో ఎన్జీవో, రెసిడెన్షియల్ సంస్థలతో జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ సమావేశం నిర్వహించారు. 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ప్రతి ఒక్కరూ ముందస్తుగా ఓటరు జాబితాలో తమ పేరును పరిశీలించుకోవాలని తెలిపారు. తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ల వివరాలు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని, ఇందుకు సంబంధించిన ఎటువంటి సందేహాలు ఉన్నా తమ పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్‌ను కానీ, ఓటరు హెల్ప్‌లైన్ ద్వారా గానీ, టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా వివరాలు ముందస్తుగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్ల అడ్రస్ కోసం గూగుల్ మ్యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. వీటిపై అవగాహన కల్పించడానికి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఎన్జీవోలు తమ వంతు సహకారం అందించాలని రొనాల్డ్ రాస్ కోరారు. ఎన్నికల సంఘం దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక సౌకర్యం కల్పించాలని సూచించినట్లు తెలిపారు. వీటితో పాటు జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా రూపొందించిన పోల్‌క్యూరూట్ యాప్ ద్వారా పోలింగ్ స్టేషన్ వద్ద క్యూలో ఎంత మంది ఓటర్లు ఉన్నారో తెలుసుకోవచ్చని.. ఈ సమాచారం యాప్‌లో పొందుపరుస్తామని కమిషనర్ తెలిపారు. ఈ యాప్ సహాయంతో ఓటర్లు తమకు అనుకూలమైన సమయంలో నేరుగా పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.




## నేటి సాయంత్రం 5 నుంచి మైక్‌లు బంద్

**ఓటింగ్ 'డే' కోసం ఏర్పాట్లు**

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. అన్ని రాజకీయ పార్టీల మైక్‌లు బంద్ కానున్నాయి. ఇన్నాళ్లు హోరా హోరిగా జరిగిన ప్రచార పర్వం పూర్తికావడంతో.. ఆయా పార్టీలు పోలింగ్ 'డే'కు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి ఓటింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ జరుగుతుంది. నియోజకవర్గాల్లో ఉన్న అన్ని పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రి సాయంత్రం వరకు చేరుకోనుంది. దీంతో పోలింగ్ బూత్‌ల వద్ద హై సెక్యూరిటీని ఏర్పాటు చేస్తున్నారు. పటిష్ట బందోబస్తు నడుమ.. ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.



రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా సోమవారం గోషామహల్ నియోజకవర్గం, మంగళ్‌హాట్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నంద కిశోర్ వ్యాస్ బిలాల్ గెలుపు కోసం ప్రచారం చేశారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్‌తో కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. - అబిడ్స్, నవంబర్ 27

## 30న 144 సెక్షన్ అమలు

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం 28వ తేదీ సాయంత్రం 5 గంటలతో పూర్తవుతున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికలను ఇన్సిడెంట్ ఫ్రీగా నిర్వహించడంలో భాగంగా రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని కమిషనర్లు డీఎస్ చౌహాన్, స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. 30వ తేదీన జరిగే ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలు, పురుషులకు ప్రత్యేక లైన్‌లు ఉంటాయన్నారు. పోలింగ్ డే రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 28వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 వరకు కమిషనరేట్ల పరిధిలో ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. పోలింగ్ డే రోజున పోలింగ్ స్టేషన్‌కు ఒక కిలో మీటర్ పరిధిలో గుంపులు గుంపులుగా ఉండటం, కర్రలు, లాఠీలు, పేలుడు పదార్థాలు, మారణాయుధాలతో సంచరించరాదని పేర్కొన్నారు. పబ్లిక్ ప్లేసెస్‌లో టెంట్లు, మండపాలు వేయడం చట్టవిరుద్ధమన్నారు. మైకులు, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ఎవరూ ఉపయోగించకూడదన్నారు. స్పీకర్ల ద్వారా మ్యూజిక్, పాటలు, ప్రసంగాలు, బ్రాడ్ కాస్టింగ్ చేయడం నిషేధమన్నారు. ఫొటోలు, పార్టీ సింబల్‌తో ఫ్ల కార్డ్స్, కుల మతల పేరుతో రెచ్చగొట్టడం, చట్టవిరుద్ధంగా ఎవరైనా నడుచుకున్నా వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, హోంగార్డు, మిలటరీ సిబ్బందికి, ఎన్నికల అధికారులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటాయన్నారు.

# కూకట్‌పల్లిలో కాంగ్రెస్, జనసేనకు బిగ్‌షాక్

**ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో.. బీఆర్ఎస్‌లోకి చేరికలు**

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 27 : అసెంబ్లీ ఎన్నికలు మరో రెండ్రోజుల్లో జరుగనున్న నేపథ్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్, జనసేన పార్టీలకు బిగ్ షాక్ తగిలింది. కేపీహెచ్‌బీ కాలనీ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మల మోహన్‌కుమార్, ఫతేనగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రేమ్, అనిల్ సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్, జనసేన పార్టీల నేతల మాయమాటలు నచ్చక.. ఆయా పార్టీల నేతలు బీఆర్ఎస్‌లో చేరడం సంతోషంగా ఉన్నదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సతీశ్ అరోరా, బీఆర్ఎస్ పార్టీ నేతలు పద్మారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన జనసేన నాయకుడు తుమ్మల మోహన్‌కుమార్



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రేమ్, అనిల్ తదితరులు

## కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారు: మాజీ ఎమ్మెల్యే విష్ణు

**విష్ణు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నాయకులు**

ఎర్రగడ్డ, నవంబర్ 27: తెలంగాణ ప్రజలందరూ సుఖ, శాంతులతో ఉండాలన్న తపనతో సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎర్ర కృష్ణకుమార్ నేతృత్వంలో ఆ పార్టీకి చెందిన పలువురు విష్ణు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎర్రగడ్డ డివిజన్ ఓల్డ్ శాస్త్రీనగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సుపరిపాలనను అందిస్తున్న కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం తథ్యమన్నారు. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కృష్ణకుమార్, ఏరియా సభ మాజీ సభ్యురాలు జ్యోతిబాయి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ మాజీ ఉపాధ్యక్షులు రవికుమార్, హరికృష్ణ, శ్రీకాంత్, కె.సత్యనారాయణ, పి.యాదగిరి, వై.సక్కుబాయి, గోపమ్మ, సావిత్రి, కమలమ్మ, సురేఖ, ఈ.లక్ష్మి, కల్పన, శిరీష, చిత్ర, అరుణ, వనజ, కె.మహేశ్వరి, ఎ.లక్ష్మి, రేణుక తదితరులు ఉన్నారు.



విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

## ప్రజలకు అందుబాటులో బీఆర్ఎస్ ప్రభుత్వం

**ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్**

హిమాయత్‌నగర్, నవంబర్27: ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అందుబాటులో ఉండి వారి కష్టాలు తీర్చి, వారి ముఖాల్లో ఆనందం కనిపించేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. కింగ్‌కోఠి, షేర్‌ఘాట్, హిమాయత్ నగర్, దత్తానగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం స్థానిక కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్ గౌడ్‌తో కలిసి దానం నాగేందర్ గడప గడపకూ తిరుగుతూ ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనను అఖండ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.



హిమాయత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్